ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్ సీతారామారావు

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 18: ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) సీతారామారావు సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐడీవోసీ ప్రజావాణి హాల్‌లో డీఆర్‌డీవో పీ.డీ నర్సింగ్‌రావు, సీపీవో భూపాల్‌రెడ్డితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను పెండింగ్ పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యలు పరిష్కరించటంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. మొత్తం 92 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. అందులో 65 ఫిర్యాదులు ధరణికి సంబంధించినవి కాగా, 27 ఫిర్యాదులు బీసీ వెల్ఫేర్, డీఆర్‌డీవో, పంచాయతీరాజ్, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కలెక్టరేట్ ఏవో శ్రీనివాసులు, ఈడీఎం నరేశ్, ధరణి ఆపరేటర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి పది ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్ ఎస్పీ కార్యాలయానికి సోమవారం నిర్వహించిన ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి 10 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని పలుప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలపై అదనపు ఎస్పీ రామేశ్వర్ స్వయంగా కలిసి వివరించారు. ఈమేరకు వారి సమస్యలపై సంబంధిత ప్రాంతాల పోలీస్ అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదుల్లో భూతగాలపై ఆరు ఫిర్యాదులు, చర్యలకు మూడు ఫిర్యాదులు, భార్యాభర్తల గొడవకు సంబంధించి ఒక ఫిర్యాదు అందినట్లు అదనపు ఎస్పీ రామేశ్వర్ పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సీతారామారావు



చెక్కు అందజేస్తున్న ఎంపీ రాములు

చెక్కు అందజేత

బల్మూరు, డిసెంబర్18: మండలంలోని గోదల్ గ్రామానికి చెందిన నజీర్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు అందజేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి జెడ్పీటీసీ భరత్ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

అరెస్టు చేయడం నీచమైన చర్య

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఉప్పునుంతల, డిసెంబర్18: మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును అకారణంగా సోమవారం వెల్దండ పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు అరెస్ట్ చేయడం నీచమైన చర్య అని ఉప్పునుంతల మండల బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌రావు, గోపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం సాయంత్రం ఉప్పునుంతల పార్టీ కార్యాలయంలో విలేరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు సహజమని, అది గ్రహించకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్పసంతోషాలకు అలవాటుపడి రౌడీయిజం, గుండాయిజం చేస్తున్నారని విమర్శించారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదన్నారు. సమావేశంలో నాయకులు శ్రీను, కురుమయ్య, ఎల్లయ్యయాదవ్, చిన్న జంగయ్య, వెంకటేశ్, బాలస్వామి, పరశురాములు, యాదగిరి, రాంప్రసాద్, మల్లేశ్ పాల్గొన్నారు.

గువ్వలను అడ్డుకోవడం దారుణం

వంగూరు, డిసెంబర్ 18: అచ్చంపేట నియోజక వర్గానికి వస్తున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు దంపతులను శాంతిభద్రతల పేరుతో పోలీసులు అడ్డుకుని వెల్దండ పోలీస్‌స్టేషన్‌కు తరలించడం దారుణమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు గణేశ్‌రావు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ హుందాగా వ్యవహరించడం మాని, రాజకీయ కక్షతో వ్యవహరించడం సరైంది కాదన్నారు.

బంగారుపూత కిరీటం బహూకరణ

బిజినపల్లి,డిసెంబర్ 18: మండలంలోని పాలెంలోని అలివేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామికి బంగారుపూత కిరీటాన్ని మోహన్‌బాబు సతీమణి ఇందిర హైదరాబాద్‌కు చెందిన వారు సోమవారం విరాళంగా అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రవి రామానుజాచార్యులకు ఆలయంలో ఇచ్చారు. భక్తులు సమర్పించిన కిరీటం స్వామివారికి అలంకరించి వారి కుటుంబ సభ్యులపేరిట స్వామివారికి పూజలు చేశారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

బిజినపల్లి, డిసెంబర్ 18: రైతులు పంటలను సాగు చేసే కంటే ముందే భూసార పరీక్షలను చేసుకొని, దాని ఫలితాల ఆధారంగా పంటలను వేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా సోమవారం మండలంలోని ఖానాపూర్‌లో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాలెం యూబీఏ మేనేజర్ సందీప్, శాస్త్రవేత్తలు రామకృష్ణ, రఘు, వెంకటేశ్ పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

నాగర్‌కర్నూల్‌టౌన్, డిసెంబర్ 18: జిల్లా కేంద్రంలోని ఎర్ర గడ్డ, వినోభనగర్ కాలనీలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం వేద బ్రాహ్మణులచే వేద మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా కల్యాణోత్సవం సోమవారం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశ్వరశర్మ తెలిపారు. కౌన్సిలర్ పద్మమ్మ, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ విశ్వప్రసాద్, సహాయ అర్చకులు వెంకటేశ్వరశర్మ, భారతి, విజయ్‌కుమార్ ఉన్నారు.

పాస్టర్లకు దుస్తుల పంపిణీ

తిమ్మాజిపేట, డిసెంబర్ 18: మండల కేంద్రంలోని హోలీ షాలేం చర్చిలో సోమవారం పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. తిమ్మాజిపేటకు చెందిన విజయ్.. మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న పాస్టర్లు 15మందికి దుస్తులు, నగదు అందజేశారు. కార్యక్రమంలో మత పెద్దలు, చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత స్క్రీనింగ్ క్యాంప్ విజయవంతం

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 18: సమగ్ర శిక్ష, తెలంగాణ బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో డాక్టర్ ముకుందరెడ్డి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్‌లోని భవిత కేంద్రంలో విద్యాశాఖ సోమవారం గ్రహణ మొర్రి శస్త్ర చికిత్సల కోసం ఉచిత స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. డీఈవో గోవిందరాజులు మాట్లాడుతూ ఆరు నెలల నుంచి 50ఏండ్ల వయస్సు కలిగిన గ్రహణ మొర్రి బాధితులకు ఉచిత వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. విద్యా శాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బర్పటి వెంకటయ్య మాట్లాడుతూ శస్త్ర చికిత్సతో చక్కని పరిష్కారం లభిస్తుందన్నారు. డాక్టర్లు జోషి, రాజేశ్ పరీక్షలు చేసి, శస్త్ర చికిత్స అవసరమైన వారిని గుర్తించారని, ఉచితంగానే ఆపరేషన్లు చేస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్‌రెడ్డి, స్ట్రాంగ్ టీచర్ వెంకటేశ్వరశెట్టి, విద్యార్థులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్‌టౌన్, డిసెంబర్ 18: తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని నెల్లికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కమర్ షాజహాన్ సుల్తానా సోమవారం ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో వృక్షశాస్త్రం బోధించడానికి 20తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు ఎంఎస్సీ బోటనీ పూర్తి చేసి, కనిష్ఠంగా 55 శాతం మార్కులు ఉండాలని, నెట్, సెట్ పీహెచ్‌డీ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

డంప్‌యార్డుకు చెత్త తరలింపు

కల్వకుర్తి, డిసెంబర్ 18: కల్వకుర్తి మున్సిపాలిటీలో నూతనంగా నిర్మించిన డంపింగ్ యార్డుకు పట్టణంలోని వివిధ వార్డుల నుంచి సేకరించిన చెత్తను తరలిస్తున్నారు. తరలించిన చెత్త నుంచి తడి, పొడిచెత్త వేరు చేసే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. తడి, పొడి చెత్త వేరు చేసి వాటి నుంచి ఎరువులు తయారు చేస్తున్నట్లు కమిషనర్ అశ్రిత్‌కుమార్ చెప్పారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

కల్వకుర్తి, డిసెంబర్ 18: స్థానిక టీఎస్ యూటీఎఫ్ భవనంలో సోమవారం జాతీయ పెన్షనర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంజనయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో ట్రెజరీ అధికారి విజయ్‌కుమార్, ప్రిన్సిపల్ సురేందర్‌రెడ్డి, సుధాకర్, జగన్‌మోహనాచారి, యాదగిరాచారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టెక్నికల్‌కోర్సు ప రీక్షకుద రఖాస్తులుచేసు కోవాలి

● డీఈవో గోవిందరాజులు

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 18: డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో లోయర్ అండ్ హయ్యర్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో డాక్టర్ గోవిందరాజులు సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 7వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన వారు లోయర్ గ్రేడ్ టెక్నికల్ పరీక్షకు హాజరుకావడానికి అర్హులని, లోయర్ గ్రేడ్ టెక్నికల్ పరీక్ష లేదా లోయర్ గ్రేడ్‌కు సరిసమానమైన టెక్నికల్ పరీక్ష పాసైన వారు సంబంధిత హయ్యర్ గ్రేడ్ పరీక్షకు హాజరుకావడానికి అర్హులని తెలిపారు. జిల్లాకేంద్రంలోని 2024 సంవత్సరం ఫిబ్రవరిలో నిర్వహించే పరీక్షకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ పరీక్షలకు హాజరు కావాలనుకునే అభ్యర్థులు www. bse. telangana. gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, డౌన్లోడ్ చేసిన వెబ్ దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఇతర రాష్ట్రాలు అండ్ బోర్డులు జారీ చేసిన ఉత్తీర్ణత సర్టిఫికెట్లు ఉన్న అభ్యర్థులు అకాడమిక్ లేదా టెక్నికల్ క్వాలిఫికేషన్లు ఉన్నవారు తెలంగాణ, హైదరాబాద్‌లోని ప్రభుత్వ పరీక్షల నుంచి ముందస్తు అనుమతిని తీసుకోవాలని తెలిపారు. ఈనెల 29వ తేదీలోపు, డ్రాయింగ్ లోయర్ రూ.100, హైయర్‌కు రూ.150, వెబ్‌అప్లికేషన్‌లను అందజేయాలన్నారు. టైలరింగ్ లోయర్ రూ.150, హయ్యర్ రూ.200లు, లెట్ రూ.50లతో జనవరి 5వ తేదిలోపు ఫీ చెల్లించిన మరుసటి రోజు ఆన్‌లైన్ సమర్పించిన దరఖాస్తు ఫారంను డీఈవో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

హాజీపూర్ చౌరస్తాలో పోలీస్ అలర్ట్

అచ్చంపేట, డిసెంబర్ 18: అచ్చంపేట మండలంలోని హాజీపూర్ చౌరస్తాలో పోలీసులు అలర్ట్‌గా మారింది. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గువ్వలబాలరాజు ఎన్నికల ఫలితాల అనంతరం మొదటిసారి అచ్చంపేటకు వస్తుండడంతో అదే హాజీపూర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించడం వల్ల ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగే అవకాశం ఉందని పోలీసులు భావించారు. అయితే గువ్వల బాలరాజు హాజీపూర్ చౌరస్తాకు వచ్చి అటు నుంచి అచ్చంపేటకు వస్తారని బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియాలో పెట్టారు. బీఆర్ఎస్ శ్రేణులు మేసేజ్ చేసిన కొన్ని గంటలకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో సోమవారం ఉదయం 10గంటలకు హాజీపూర్ వద్ద ఉంటుందిదీనికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొంటారని కాంగ్రెస్ శ్రేణులు సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. దీంతో ఇరువర్గాలు మధ్య ఘర్షణ జరిగే అవకాశం ఉందని అందరు భావించారు. ముందుగా బీఆర్ఎస్ శ్రేణులు ప్రకటించిన తర్వాత కాంగ్రెస్ శ్రేణులు గువ్వల బాలరాజును అడ్డుకొని దాడులు చేయాలనే కుట్రతోనే కావాలని కార్యకర్తల సమావేశం హాజీపూర్ వద్ద పెట్టడం పట్ల ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్‌శ్రేణులు పేర్కొన్నారు. అయితే గువ్వల బాలరాజు హాజీపూర్‌కు వస్తే రెండువర్గాల మధ్య కచ్చితంగా ఘర్షణ జరిగే వాతావరణం ఉన్నది. హాజీపూర్ వద్ద ఘర్షణ జరిగే అవకాశం ఉందని సమాచారం అందుకున్న పోలీసులు ముందస్తుగా గువ్వల బాలరాజును వెల్దండ పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని తిప్పిపంపడం పట్ల హాజీపూర్ చౌరస్తా వద్ద ఎలాంటి ఘర్షణ జరుగలేదు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అచ్చంపేటకు వస్తే కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకొని దాడులు చేసేందుకు పూనుకోవడం మంచిపద్ధతి కాదని పలువురు బీఆర్ఎస్ నేతలు జెడ్పీటీసీ రాంబాబు, కౌన్సిలర్ అంతటి శివ, మన్ను పటేల్, పుల్జాల రమేశ్, ప్రవీణ్, రహమత్, ఖలీల్, అన్వర్, సుంకరి బాలరాజు తదితరులు ఖండించారు.

గువ్వల అరెస్టు అప్రజాస్వామికం

లింగాల, డిసెంబర్ 18: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ జిల్లా నాయకులు తిరుపతయ్య, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవిశంకర్ సోమవారం ఆరోపించారు. వెల్దండ వద్ద పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని విమర్శించారు.

ఆటో బోల్తా

లింగాల,డిసెంబర్ 18: మండలంలోని సూరాపూర్ శివారులో ఆటో బోల్తాపడి పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. కోమటికుంట గుగ్గిళ్ల శేషు ఆటోడ్రైవర్. లింగాల నుంచి వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

లింగాల, డిసెంబర్ 18: భక్తిభావాన్ని అలవర్చుకున్నప్పుడే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని అంబట్‌పల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మూడు రోజులుగా గణపతి, శివలింగపార్వతి, నందీశ్వర, కుమారస్వామి, వీరభద్ర, నాగదేవత ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. సోమవారం ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవచింతనతోనే మనస్సు ప్రశాంతత లభిస్తున్నదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవిశంకర్, శ్రీనివాస్‌రాథోడ్ పాల్గొన్నారు.

బియ్యం పట్టివేత : కేసు నమోదు

కోడేరు డిసెంబర్ 18: మండలంలోని నాగులపల్లి నుంచి కోడేరుకు అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు కోడేరు ఎస్సై శేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు.

ఓటర్ జాబితాపై అవగాహన

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 18: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితాపై బీఎల్‌వోలకు తాసీల్దార్ ఇబ్రహీం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులను గుర్తించి, ఓటుహక్కు కోసం దరఖాస్తు చేయించాలని, జాబితాలో తప్పొప్పులను సరిచేయాలని సూచించారు.

జాతీయ సదస్సులతో మేధస్సు

కొల్లాపూర్, డిసెంబర్ 18: జాతీయ సదస్సులు నిర్వహించడం వల్ల గ్రామీణ యువతకు మేధస్సు పెరుగుతుందని, ఉన్నత చదువులకు ఎంతో ఉపయోగపడుతుందని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. పీయూ కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో విపత్తు నిర్వహణలో సంఘ సేవకుని పాత్రపై సోషల్ వర్క్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో రెండ్రోజుల జాతీయ సదస్సును ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. తొలిరోజు డాక్టర్ అర్జున్‌విజయ్, బాబు మాట్లాడారు.